క్లుప్తంగా

యాంటీడ్రగ్స్‌పై చిత్రలేఖన పోటీలు

• ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అందరికీ అవగాహన కలిగేలా యాంటీడ్రగ్స్‌పై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలో ఈ నెల 19న పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయడానికి ఆయా మండల పోలీసు అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. 2 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ నుంచి డిగ్రీ చదివే విద్యార్థులను కేటగిరీల వారీగా కేటాయించినట్లు వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: జిల్లా న్యూస్ ఏజెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, అసోసియేషన్ అధ్యక్షుడు యెల్లె రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు గొల్లపలి మల్లేశం, ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రాజు, బొద్దుల బాలకృష్ణ, గుండెల్లి నాగభూషణం, బైరి దేవదాసు, పిస్కె సాయికుమార్, రాగుల వేణుగోపాల్ తదతరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాస్టర్ గగ్గురి దివ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్పార్క్ కుంగ్ పూలో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇంటర్ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ 2024పోటీలను పరకాల హన్మకొండలో ఈనెల 7న నిర్వహించారు. కరాటే అంతర్రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చారన్నారు. విద్యార్థులు గోల్డ్‌మెడల్, వెండి రజత పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ఆర్గనైజర్లు సంపత్, మాస్టర్ అమిత్, శ్రీనివాస్ అభినందించారు.

విరాళం అందజేత



నాయకులకు ప్రసాదాలు అందిస్తున్న అర్చకుడు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించే పడిపూజ కార్యక్రమాలకు జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు రూ.11,116, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి రూ.10,116లను బుధవారం ఆలయ అర్చకులు రమాకాంత్ గౌతమ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పంచామృతాలతో ప్రత్యేక పూజలు చేశారు. దాతలను అర్చకులు శాలువాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు దేవదాస్, అయ్యప్ప గురుస్వాములు కందుకూరి రవి, సతీశ్ తదితరులున్నారు.

జీపీ భవనం ప్రారంభంపై కలెక్టర్ సీరియస్?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎలాంటి సమాచారం లేకుండా బుధవారం పాలకవర్గం ప్రారంభించడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రొటోకాల్ పాటించకుండా పంచాయతీ భవనం ప్రారంభించిన సర్పంచ్‌తోపాటు పాలకవర్గానికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, అధికారులకు మెమోలు జారీచేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా అధికారులకు తెలపకుండా జీపీని ప్రారంభించడంపై కలెక్టర్ చర్యలకు దిగడంతో మండలవ్యాప్తంగా చర్చానీయాంశమైంది.

ఐఎస్‌వో సర్టిఫికెట్ పొందడంపై హర్షం

వేములవాడరూరల్: వేములవాడలోని శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ రావడంపై ప్రిన్సిపల్ పద్మజ హర్షం వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ పొందేందుకు సహకారం అందించిన సెక్రటరీ నికోలస్, జాయింట్ సెక్రెటరీ నిరుప, భాను ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ద్వారా రైతుబజార్ సమీపంలో ఏర్పాటు చేసిన దుస్తుల నిధిని సక్రమంగా వినియోగించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు దుస్తులు అందించగా ఆయన మాట్లాడారు. నిరుపేదలకు దుస్తులు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన క్లాత్‌బ్యాంక్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిధికి వచ్చిన దుస్తులను అనాథలు, పేదలకు అందించాలన్నారు. గణేశ్, దేవదాసు, మల్లేశం, తదితరులున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది



ఈ ఫొటోలో కనిపిస్తున్న గుగులోతు లలితది చింతామణి తండా. ఆరోగ్యం బాగా లేక రక్త పరీక్షలు చేయించుకుందామని బడితండాలోని ఆస్పత్రికి వెళదామనుకుంది. కానీ ఆ ఆస్పత్రిలో రక్త, మూత్ర పరీక్షలు చేసే సౌకర్యం లేకపోవడంతో 36 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుట్లలోని ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టి పరీక్షలు చేయించుకుంది. ఇలా ఈమెనే కాదు.. మానాల, 18 గిరిజన తండాల్లోని ప్రజలు బడితండా గ్రామంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త, మూత్ర పరీక్షలు చేసే అవకాశం లేక దూరంలో ఉన్న కోరుట్ల, వేములవాడ పట్టణాలకు వెళ్లి ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.వేలు ఖర్చు చేస్తూ వైద్యం చేయించుకుంటున్నారు. బడితండా ఆస్పత్రిలోనే రక్త, మూత్ర పరీక్షలు చేసేలా చూడాలని వారు కోరుతున్నారు. 24 గంటలు వైద్యులను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బడితండా గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి

- ప్రత్యేక వైద్యుడు లేని ప్రభుత్వ దవాఖాన
- ఆశ వర్కర్లే వైద్యులు
- మారుమూల గిరిజనులకందని ప్రభుత్వ ఉచిత వైద్య సేవలు

రుద్రంగి(వేములవాడ): మారుమూల మానాల, గైదిగుట్టతండా, అడ్డబోర్‌తండా, దేగావత్‌తండా, వీరుని, చింతామణి, బడి, రూప్లానాయక్, సర్పంచ్ గిరిజనతండా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్పత్రి అలంకారప్రాయంగా మారింది. ఆస్పత్రి ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో.. గిరిజనతండా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షే అవుతోంది. అందుబాటులో ఉండే వైద్యులు, సిబ్బందిని నియమించి గిరిజనులకు ప్రభుత్వ వైద్య సేవలందించాలని వారు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఆస్పత్రికి ప్రత్యేక వైద్యుడు లేకపోవడంతో ఆశ వర్కర్లే మందులు పంపిణీ చేస్తున్నట్లు రోగులు తెలుపుతున్నారు. వైద్యులు అందించే వైద్య సేవలు ఆశ వర్కర్లు అందించడం వల్ల రోగులకు ఏమైనా రియాక్షన్స్ వస్తే రికవరీ చేయడం తెలియక రోగుల ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆదోళన చెందుతున్నారు.

రూ.1.2కోట్లతో నిర్మాణం

మారుమూల మానాల, గిరిజనతండా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్యం చేరువ చేసేందుకు బడితండా గ్రామంలో రూ.1.2 కోట్లతో 30 పడకల పీహెచ్‌సీని నిర్మించారు. ఆస్పత్రి నిర్మించి ప్రత్యేక వైద్యుడు, సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో.. మానాల, గిరిజనతండా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలందక ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

ఇంత నిర్లక్ష్యమా..

గిరిజనులకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆస్పత్రి పనుల్లో అధికారులది, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని గిరిజనతండా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగి ఏళ్ల తరబడి భవనం పూర్తి కాలేదన్నారు. ఆస్పత్రి ప్రారంభమయ్యాక కూడా ప్రత్యేక వైద్యుడు, సరిపడా సిబ్బంది నియమాకంలో కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని, త్వరగా వైద్యుడు, సిబ్బందిని నియమించి ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

బెడ్లు లేని ఆస్పత్రి

30 పడకల ఆస్పత్రిలో ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు కనీసం పది బెడ్లు కూడా లేకుండా నడుస్తోంది. ఆస్పత్రికి ప్రత్యేక ప్రభుత్వ వైద్యుడిని అలాట్ చేశామని ఉన్నతాధికారులు చెబుతున్నా.. ఆయన ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో తెలియదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

వసతులు కల్పించాలి



మారుమూల, గిరిజనతండాల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కల్పించాలి. మా గిరిజనతండాల ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలి.

– రాందాస్, చింతామణితండా గ్రామం

త్వరలోనే నియమిస్తాం



బడితండా గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ప్రత్యేక వైద్యుడిని అలాట్ చేశాం. రక్త, మూత్ర పరీక్షలకు శాంపిల్స్ పంపితే సరిపోద్ది. ప్రభుత్వ డీఎఫ్ సర్వీస్ ఉంది. చందుర్తి దాకా వస్తుంది. రుద్రంగికి కూడా పంపుతాం. పేషెంట్లు శాంపిల్ పట్టికొని వస్తారు ఏముంది. పరీక్షలు నిర్వహించి పేషెంట్ మొబైల్ ఫోన్‌కు రిపోర్టులను పంపిస్తాం. ఆస్పత్రిలో సిబ్బంది కొరతతో ఇబ్బంది ఉంది. ప్రభుత్వానికి విన్నవించి త్వరలోనే సిబ్బందిని నియమించేలా చూస్తాం.

– డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి, రాజన్నసిరిసిల్ల

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



గోపిక, గోపాలుడి వేషధారణలో చిన్నారులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రేపల్లె వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక–గోపాలుడి వేషధారణలతో అందరినీ అలరించారు. వేడుకల్లో నృత్యాల్లో రాణించిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయంలో అర్చకులు నవీన్‌చారి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, గోదాగోష్టి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట, కోనరావుపేట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ బుధవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందుల నిల్వ వివరాలు పరిశీలించారు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సన్మానిస్తున్న నాయకులు

గంభీరావుపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పార్టీ సంస్థాగత సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, పత్తి స్వామి, వాజీద్‌హుస్సేన్, పరశురాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



ముస్తాబాద్: మండలంలోని కొదాటివానిపల్లెకు చెందిన రైతు దేవరాజు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా నిలుస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి 50 కిలోల బియ్యం, నగదు అందజేశారు. ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, యువజన శాఖ మండల అధ్యక్షుడు రంజాని నరేశ్, ఎద్దండి మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

వరకట్న వేధింపులపై కేసు

సిరిసిల్లక్రైం: వివాహమైన ఐదేళ్లకు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్న అత్తారింటి వారిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణం వెంకంపేటకు చెందిన అంబాల శ్రావణికి స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన అంబాల మహేశ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల కట్నం ఇచ్చినా అదనం మరో రూ.2లక్షల కట్నం తీసుకురావాలని భర్త మహేశ్‌తోపాటు అత్త దేవలక్ష్మి, మామ శంకరయ్య, ఆడబిడ్డ మ్యాన సంధ్య, బావలు వెంకటనాగులు, వేణు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారు. బాధితురాలు ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై..

పేదలకు ప్రభుత్వం అందించే పీడీఎస్ బియ్యాన్ని రైస్‌మిల్లులో అధికధరకు విక్రయించేందుకు వెళ్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. వేములవాడలోని లక్ష్మీనగర్‌కు చెందిన ద్యావనవేణి రాజయ్య ద్విచక్రవాహనంపై తక్కువ ధరకు క్వింటాల్ పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి వాటిని సిరిసిల్లలోని ఓ రైస్ మిల్లులో అమ్మేందుకు వెళ్తున్నాడు. పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్లటౌన్: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సిరిసిల్లలోని ' సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం' విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 16,17,18 తేదీల్లో జనగామలో జరిగే పోటీలకు అండర్–14 విభాగంలో బి. శ్రీనిధి, సీ.హెచ్. పల్లవి, బి. అక్షయ్ ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల కరెస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్, ప్రిన్సిపాళ్లు బిజ్జు, మార్టిన్, పీఈటీ మదన్ అభినందించారు.

పరామర్శ

చందుర్తి : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బుధవారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం పరామర్శించారు. ఇక్కడ పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, ఎంపీటీసీ రమేశ్‌రావు, సర్పంచులు తదితరులున్నారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన చెకుట తిరుపతి భార్య ఇటీవల మృతిచెందింది. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్ బుధవారం ఆయనను పరామర్శించారు. మాజీ సర్పంచ్ బండ సత్తయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు భూమేశ్, నాయకులు తదితరులున్నారు.

నూతన కార్యవర్గం

తంగళ్లపల్లి: సారంపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మునిగెల అంజయ్యను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దాసరి గణేశ్, నేరెళ్ల శ్రీకృష్ణ యాదవ సంఘం నూతనకమిటీ అధ్యక్షుడిగా గంధం నారాయణ, ఉపాధ్యక్షుడిగా మారవేని మల్లేశంను ఎన్నుకున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెజ్జంకి సుమన్, ఉపాధ్యక్షుడిగా వంతడుపుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా శ్యాగ రవీందర్, కోశాధికారిగా శ్యాగ సురేశ్, ఆర్గనైజర్ నర్సయ సలహాదారులుగా శ్యాగ యాదగిరి, వంతడుపుల శ్రీనివాస్, శ్యాగ దేవేందర్, రవీందర్, చంద్రం, ప్రసాద్ ఎన్నికయ్యారు.

22న సెలవు ప్రకటించాలి

ముస్తాబాద్: అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈనెల 22న సెలవు ప్రకటించాలని బందనకల్ ఉపసర్పంచ్ కస్తూరి కార్తీక్‌రెడ్డి కోరారు. తెలంగాణ ప్రజలు అయోధ్య ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలన్నారు.

విద్యార్థులకు మాక్‌పోలింగ్

చందుర్తి : మండలంలోని సనుగుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పర్యవేక్షకులుగా ప్రధానోపాధ్యాయుడు రేకొండ సత్యనారాయణ, ఎన్నికల అధికారిగా ఉపాధ్యాయుడు మారంపెల్లి హన్మండ్లు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): నకిలీవీసాలు అంటగట్టి మోసానికి పాల్పడ్డ గల్ఫ్ ఏజెంట్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన విక్కుర్తి రాజు, దొంతరవేణి మహేశ్ దుబాయ్‌కి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుండగా రుద్రంగికి చెందిన బాలాజీ ట్రావెల్స్ యజమాని ధరావత్ విఠల్ పరిచయం చేసుకున్నాడు. దుబాయ్‌కు పంపిస్తానని నమ్మించి ఇద్దరి నుంచి చెరో రూ.లక్ష తీసుకుని నకిలీ వీసాలు ఇచ్చాడు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో ఏజెంట్ విఠల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేయాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రా మాల ప్రజలకు ఆధార్ కార్డు నమోదు కేంద్రం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాన్నారు. ఆధార్‌లో మార్పుల చేర్పుల కోసం ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యం, నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం కొండపోచమ్మ తల్లి ఆలయాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మొక్కులు తీర్చుకుంటామని గంగాధర మండల కాంగ్రెస్ నాయకులు పడాల రాజిరెడ్డి, జాగీరపు శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికల సమయంలో కోరెం పోచమ్మ తల్లికి మొక్కుకున్నారు. కాగా ఎమ్మెల్యే సత్యం కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న కోరుట్లపేటకు చొప్పదండి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని కోరుట్లపేటకు చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈనెల 12న తొలిసారిగా స్వగ్రామానికి రానున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య బుధవారం తెలిపారు. కోరుట్లపేటలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. సత్యం సోదరుడు మేడిపల్లి దేవానందం ప్రస్తుతం కోరుట్లపేట సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. నాయకులు, కార్యకర్తలు, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

అయోధ్య రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



దేశాయిపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లిలో బుధవారం అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, నాయకులు నిమ్మ శ్రీనివాస రెడ్డి, ఎమిరెడ్డి మల్లారెడ్డి, కల్యాణం అనిల్, మానేరు లచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

కోనరావుపేట: నిమ్మపల్లి, కనగర్తిలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఎలగందుల గణేశ్, అబ్బాస్ లక్ష్మీనారాయణ, మధు, సంతోష్, శ్రీనివాస్, మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

గంభీరావుపేట: అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ అందిస్తామని భక్తులు తెలిపారు. మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నుంచి అక్షింతలను శోభాయాత్రగా తీసుకెళ్లారు.

లక్ష్యంతో ముందుకుసాగాలి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- విజ్ఞాన్‌స్కూల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ఒక లక్ష్యంతో ముందుకుసాగాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను బుధవారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఆధునిక వసతులతో పాఠశాలను ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో పాఠశాలను మరింత అభివృద్ధి చేసి నిరుపేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యనందించాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కరస్పాండెంట్ లతీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా మస్టర్ నిర్వహించాలి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని ఈజీఎస్ పనులు గతంలో కంటే పురోగతిని సాధించాయని అడిషనల్ పీడీ మదన్మోహన్, ఎంపీపీ బూర వజ్రమ్మ అన్నారు. వేములవాడ మండల పరిషత్ ఆవరణలో బుధవారం ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో జరిగిన ఈజీఎస్ పనులపై ఆడిట్ బృందం గ్రామాల్లో తయారు చేసిన నివేదికను చదవి వినిపించారు. రికార్డులో తప్పులు ఉండటంతో పాటు మస్టర్లో కొట్టివేతలుండగా ఆరెపల్లి, చీర్లవంచ పంచాయతీ కార్యదర్శులకు జరిమానా విధించారు. అలాగే ఎంపీ బుక్, రోజుగారి దివాస్ కార్యక్రమాలను సరిగా నిర్వహించని కార్యదర్శులకు 9 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణరావు, ఎంపీడీవో శ్రీధర్, ఏపీడీ నర్సింహ, తదితరులున్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలోని జ్ఞానదీప్ ఉన్నత, రాచర్ల గుండారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిపారు. జ్ఞానదీప్ పాఠశాలల్లో ముగ్గుల పోటీల్లో నారవెల్లి స్రవంతి మొదటి బహుమతి, రెండో బహుమతి మారెపు పల్లవి, మూడో బహుమతి సద్ది లత గెలుచుకున్నారు. అనంతరం కుర్చీ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి చల్ల రవళి, రెండో బహుమతి నీరటి కవిత, మూడో బహుమతి పిల్లి సబిత గెలుచుకున్నారు. గెలుపొందిన వారికి పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీ నారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిన్సీజార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలోని మహర్షి స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల ముగ్గులు వేశారు. కరస్పాండెంట్ జలజరామ్ మనోహర్‌రావు, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తది తరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ముస్తాబాద్: మండల మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం మండల అధ్యక్షుడు మెంగని రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెంగని రాజు, మెంగని మనోహర్, అల్లం లక్ష్మణ్, మెంగని శ్రీనివాస్, కుక్కల దేవేందర్, శీలం స్వామి, బొప్పనర్సయ్య, ధర్మేందర్, రాజం, గోపాల్, బాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

మండలవనరుల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలెండర్–2024ను బుధవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు వెల్మల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: పీఆర్‌టీయూ వార్షిక క్యాలెండర్‌ను గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆవిష్కరించారు. హెచ్ఎం నర్సింగరావు, మండలశాఖ అధ్యక్షుడు ప్రవీణ్, శంకర్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అంతయ్య బహిరంగ క్షమాపణ చెప్పాలి'

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో మంగళవారం అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్రలో ఎంపీటీసీ అంతయ్య బూట్లు వేసుకొని పాల్గొనడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని, హిందూ బంధువులందరికీ ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు సిరిసిల్ల వంశీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడారు.

జీపీ భవనం ప్రారంభం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ అంకారపు అనిత ఎంపీపీ పడిగెల మానసతో కలిసి ప్రారంభించారు. ఉపసర్పంచ్ తిరుపతి, నాయకులు రాంలింగారెడ్డి, ప్రవీణ్ జేటోని, వైద్య శివప్రసాద్, రవీందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.